# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 3 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల మంగళవారం 8 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 3 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA TUE 8 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం

- నెల్లూరు నుంచి నేరుగా తిరుమల వెళ్లిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యూపీ సీఎం యోగి
- వెంకయ్య నాయుడు ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధి అని ప్రశంస
- స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవలను కొనియాడిన యోగి ఆదిత్యనాథ్
- గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ నెలకొల్పామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- తన పిల్లలను రాజకీయాలకు దూరం పెట్టానని, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరిన వెంకయ్య

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు.దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

- మిగతా 2లో

# కార్యకర్తలే పార్టీకి బలం..

## వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

### లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు

- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్–2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్–2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్–2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2లో



గ్యాస్ వినియోగదారులకు

## గుడ్‌న్యూస్..

### బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

- మిగతా 2లో



## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

### దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది వారే: లోక్‌సభ స్పీకర్

- భారత చరిత్రలో మహిళలే అసలైన మార్పునకు మార్గదర్శకులన్న ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల పాత్ర కీలకమని వెల్లడి
- నేటి మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారని వ్యాఖ్య
- మహిళా శాసనసభ్యుల కోసం జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేక వర్క్‌షాప్

- మిగతా 2లో

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
- ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి
- అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని

- మిగతా 2లో

## కుప్పంలో టీచర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

### కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

- కుప్పంలో మాజీ సైనికుడైన టీచర్‌పై తరగతి గదిలో దాడి
- గురుపూజోత్సవం రోజే విద్యార్థుల ముందే అమానుష ఘటన
- మీడియా ప్రతినిధులమని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- స్పోర్ట్స్ కోటా టీచర్లే లక్ష్యంగా బెదిరింపుల దందా నడుస్తోందని వెల్లడి
- ఉపాధ్యాయుల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ప్రభుత్వం

- మిగతా 2లో






తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్

## కంటతడీ

- అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

- మిగతా 2లో

# డీఎస్సీలో భారీ స్కామ్ జరిగింది..

### మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐతో విచారణ జరిపించాలి

- డీఎస్సీ నియామకాల్లో భారీ స్కామ్ జరిగిందని వైసీపీ ఆరోపణ
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్
- ఇది 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్' స్కామ్ అని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- స్పోర్ట్స్ కోటా, అర్హతల్లో అక్రమాలు జరిగాయంటూ సజ్జల ఆరోపణ
- విచారణకు ఆదేశించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక

- మిగతా 2లో



## ఉద్యోగాల పేరుతో మోసం

### ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్
- లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లండన్‌లో ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు నందనను అప్పగించిన అధికారులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



- మిగతా 2లో

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

# 12 మంది దుర్మరణం

- ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పత్‌లో పికప్ వాహనం బోల్తా
- ప్రమాదంలో 12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు
- రాజస్థాన్ నుంచి బదౌన్ వెళ్తుండగా అర్ధరాత్రి ఘటన
- డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- మృతుల కుటుంబాల కోసం పోలీసులు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

- మిగతా 2లో





## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## మెగా డీఎస్సీపై... ఓపెన్ డిబేట్ సాధ్యమా

ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల చుట్టూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నడుపుతున్న రాజకీయ డ్రామా రోజురోజుకూ తన విశ్వసనీయతను కోల్పోతోంది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో బురద చల్లడం, ప్రెస్ మీట్లలో వ్యాఖ్యలు చేసి వెళ్లిపోవడం కాకుండా.. ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌పై వైసీపీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆధారాలుంటే ప్రజల ముందు పెట్టాలి తప్ప, తెరవెనుక దాక్కుని రాళ్లేయడం, ముసుగు సంస్థలతో తప్పుడు ప్రచారాలు చేయించడం, రాజకీయ ప్రయోజనాల కోసం సీబీఐ విచారణ కోరడం రాజకీయం కాదు. అసలు సీబీఐకి అప్పగించిన ఏ కేసును ఆ సంస్థ ఎంత త్వరగా పూర్తి చేసిందో వైసీపీ స్పష్టం చేయగలదా? మాజీ ఎంపీ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణే ఏళ్ల తరబడి కొలిక్కిరాకుండా సాగుతుంటే, ఉపాధ్యాయ నియామకాలను సీబీఐకి ఇవ్వాలనడం పదహారు వేల మంది టీచర్ల కుటుంబాలపై కుట్రలు చేయడమే.ప్రజాస్వామ్యంలో ఏ విషయమైనా తేలాల్సింది ప్రజల సమక్షంలో, చట్టసభల ప్రాంగణంలో! విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీ లోపలైనా, బయటైనా, సమయం-వేదిక జగన్ రెడ్డి ఇష్టానికే వదిలేస్తూ పాయింట్ టు పాయింట్ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులను రికార్డు స్థాయిలో 148 రోజుల్లో అత్యంత పారదర్శకంగా, టీసీఎస్ ప్లాట్‌ఫారమ్ ద్వారా, సుప్రీంకోర్టు రిజర్వేషన్ నిబంధనలకు కట్టుబడి భర్తీ చేశామని ప్రభుత్వం ఆధారాలతో సహా వివరణ ఇచ్చింది. 141 రకాల కోర్టు కేసులతో నియామకాలను నిలిపివేసేందుకు ప్రయత్నించినా, న్యాయస్థానాలు వాటిని కొట్టివేస్తూ నోటిఫికేషన్‌లోని పారదర్శకతను సమర్థించాయి. ఇన్ని వాస్తవాలు కళ్లముందు కనిపిస్తుంటే, నాకు నేను చాలు అంటూ వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలతో కవర్ డ్రైవ్‌లు వేయించడం జగన్ రెడ్డికి రాజకీయంగా మారింది. .నేరుగా లోకేష్ రాజీనామాను డిమాండ్ చేస్తున్నది జగన్ మోహన్ రెడ్డి అయినప్పుడు, ఆయనే స్వయంగా వచ్చి చర్చకు కూర్చోవాల్సిన బాధ్యత ఉంది. విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి అంశంలోనూ పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి లోకేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో డేటాను సమర్పించారు. మరి వైసీపీ వద్ద నిజంగానే డీఎస్సీ ప్రక్రియలో లోపాలు ఉన్నాయనడానికి ఆధారాలు ఉంటే, వాటిని మంత్రి ముందే బహిర్గతం చేసి ప్రజలకు ఎందుకు నిజాలు తెలియజేయకూడదు? బెయిల్ నిబంధనలు లేదా విచారణల సాకు చూపి చట్టసభలకు రాకుండా తప్పించుకోవడం ద్వారా తాము చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ బురదచల్లుడు చర్యలేనని జగన్ స్వయంగా అంగీకరించినట్లవుతోంది. రోజుకో డ్రామా ఆడటం, ఆధారం లేని ఆరోపణలు చేసి పారిపోవడం వల్ల ప్రతిపక్షానికే నష్టం. గత ఐదేళ్ల తమ హయాంలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేక, దాదాపు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ బడులకు వెళ్లేలా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన చరిత్ర వైసీపీది. అటువంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి మొదటి సంతకంతో మెగా డీఎస్సీని పూర్తి చేసి వేలాది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందిస్తే ఉద్యోగం రాని వారిని రెచ్చగొట్టేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నిరుద్యోగ యువత భవిష్యత్తు , విద్యార్హతల ఆధారంగా జరిగిన మెగా డీఎస్సీపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి జగన్ రెడ్డికి మంచి అవకాశం ఉంది. మీడియా ముందు హాఫ్ ట్రూత్స్ మాట్లాడటం, బాధ్యతారాహిత్యంగా రాజీనామాలు కోరడం మాని, లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి ముఖాముఖి చర్చకు రావాలి. ఆధారం లేని బురద చల్లే రాజకీయాలకు ముగింపు పలికి, ప్రజల సమక్షంలో నిజానిజాలు తేల్చుకోవడమే ప్రజాస్వామ్య పద్ధతి!పారిపోవడం వీరత్వం అనిపించుకోదు; నిజాయితీ ఉంటే జగన్ రెడ్డి చర్చల వేదికపై అడుగుపెట్టాల్సిందే

## కుప్పంలో టీచర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

చిత్తూరు జిల్లా కుప్పంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గురుపూజోత్సవం రోజే, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు దేశానికి సేవ చేసిన ఒక మాజీ సైనిక హవల్దార్ కావడం గమనార్హం. ఈ ఘటనను పాఠశాల విద్యాశాఖ సుమోటోగా స్వీకరించి, నిందితులపై కఠినమైన క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఇది స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఒక వ్యవస్థీకృత బెదిరింపుల దందా అని అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు.

**విద్యార్థుల ముందే దాడి**

వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున కుప్పంలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా, ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. తాము మీడియా ప్రతినిధులమని చెబుతూ, ఉపాధ్యాయుడి మిలిటరీ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల ముందే అవమానకరంగా మాట్లాడారు. తన వ్యక్తిగత పత్రాలు అడిగే అధికారం మీకెక్కడిదని ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో, వారు రెచ్చిపోయి ఆయన కాలర్ పట్టుకుని గొడవకు పాల్పడ్డారు.

విచారణలో ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని తేలింది. ఘటనకు రెండు రోజుల ముందు, అంటే సెప్టెంబర్ 3న, నిందితులు ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి 20 నిమిషాల పాటు మాట్లాడారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఆయనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తామని బెదిరించారు. ఈ ఘటనతో ఉపాధ్యాయుడు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**నిందితుల అరెస్ట్, బెదిరింపుల దందా వెలుగులోకి**

ఈ అమానుష ఘటనపై పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి, స్థానిక పోలీసుల సమన్వయంతో క్రిమినల్ కేసు నమోదు చేయించింది. పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి, మీడియా ప్రతినిధులమని చెప్పుకుంటున్న శ్రీకాంత్ (సాక్షి రిపోర్టర్), గణేశ్ (సాక్షి కెమెరామెన్) అనే ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. "ఇది చాలా బాధాకరమైన సంఘటన. దేశానికి సేవ చేసి, ఇప్పుడు ఉపాధ్యాయుడిగా గౌరవప్రదమైన వృత్తిని స్వీకరించిన ఒక మాజీ సైనికుడి పట్ల ఇలా ప్రవర్తించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని తమీమ్ అన్సారియా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 372 మంది ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు. మీడియా ప్రతినిధులుగా నటిస్తూ, సర్టిఫికెట్లు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని ఆమె వివరించారు.

**ఉపాధ్యాయులకు పూర్తి రక్షణ**

పాఠశాల ప్రాంగణాల్లోకి అనధికారికంగా ప్రవేశించి ఉపాధ్యాయులను బెదిరించినా, వేధించినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తీవ్రంగా హెచ్చరించింది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చింది. ఇలాంటి బెదిరింపు కాల్స్ లేదా వేధింపులు ఎదురైతే, వెంటనే తమ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ సూచించింది. బాధితులకు పూర్తి పరిపాలన, చట్టపరమైన మద్దతు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. నిరాధార ఆరోపణలు మాని, ఆధారాలతో కూడిన ఫిర్యాదులు ఉంటే విద్యాభవన్‌లోని గ్రీవెన్స్ సెల్‌కు అందజేయాలని ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

- మొదటి పేజి తరువాయి

నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు.కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

## డీఎస్సీలో భారీ స్కామ్ జరిగింది..

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. ఇది 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్' స్కామ్ అని అభివర్ణించిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సోమవారం అమరావతిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్ పోస్టులను అడ్డగోలుగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వ పెద్దలు స్పందించకుండా, పాఠశాల విద్య కమిషనర్, శాప్ ఎండీ వంటి అధికారులతో మొక్కుబడి సమాధానాలు ఇప్పించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జీవో)లను మార్చడం వంటి కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, 'డీ ఫ్యాక్టో సీఎం'గా వ్యవహరిస్తున్న మంత్రి లోకేశ్‌కు తెలియకుండా జరగవని, కాబట్టి శాఖాపరమైన విచారణలతో ప్రయోజనం లేదని సజ్జల స్పష్టం చేశారు.'మెగా డీఎస్సీ' పేరుతో కొత్తగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, కానీ వాస్తవానికి తమ ప్రభుత్వ హయాంలో జగన్ నోటిఫై చేసిన 6,300 పోస్టులనే ఇప్పుడు భర్తీ చేస్తున్నారని సజ్జల గుర్తుచేశారు. పారదర్శకతకు విరుద్ధంగా, ఎంపిక వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచకుండా, అభ్యర్థులకు 'వ్యక్తిగత సమాచారం' పంపి గోప్యత పాటిస్తున్నారని ఆరోపించారు.

ఈ సందర్భంగా సజ్జల పలు ఆరోపణలు చేశారు. కోచింగ్ సెంటర్ల ద్వారా 120 ప్రశ్నలను రూ. 3 లక్షలకు అమ్ముకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో చంద్ర నాయక్, సుధా రాణి, రియాజుల్లా, పావని వంటి వారు జరగని క్రీడల్లో పాల్గొన్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించారని ఆరోపించారు. పరీక్ష రాయకుండానే రూ. 15 లక్షలు చెల్లించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించినట్లు ఓ మహిళా అభ్యర్థి టెలివిజన్‌లో అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతపురంలో గణితం డిగ్రీ ఉన్న తిరుమల అనే అభ్యర్థిని ఇంగ్లీష్ టెట్‌లో అర్హత లేకపోయినా ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా నియమించారని, 75 మార్కులు కటాఫ్ ఉండగా 63 మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థి విశ్వేశ్వరరావును ఎంపిక చేశారని పేర్కొన్నారు. ప్రభాకర్ అనే అభ్యర్థిపై 2025 డిసెంబర్‌లో ఆర్డీవో ఇచ్చిన నివేదికను కలెక్టర్ తొక్కిపెట్టారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, హర్యానా వంటి రాష్ట్రాల్లో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో మంత్రులు, ఉన్నతాధికారులు సీబీఐ, ఈడీ విచారణలు ఎదుర్కొని జైలుకు వెళ్లిన విషయాన్ని సజ్జల గుర్తుచేశారు. "ఎంతకాలం బాధ్యులైన వారిని కాపాడతారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం సీబీఐ విచారణకు అంగీకరించకపోతే, తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం ఎందుకు స్వతంత్ర దర్యాప్తునకు వెనుకాడుతోందో ప్రజలు, అర్హులైన అభ్యర్థులు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్-సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

**గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు**

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు.

ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి

- మొదటి పేజి తరువాయి

ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది.మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది.గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు.కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు.పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## ఉద్యోగాల పేరుతో మోసం: ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- మొదటి పేజి తరువాయి

అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది.రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని కొనియాడారు. దేశం సంస్థాగత నిర్మాణం, ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక సంప్రదాయాలలో మహిళల సహకారం, గౌరవం, నాయకత్వం ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు కేవలం మార్పునకు సంకేతంగా నిలవడమే కాకుండా, వివిధ రంగాలలో అపూర్వమైన విజయాలు సాధిస్తూ, తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ఓం బిర్లా అన్నారు. వారిలో ఉన్న సహజసిద్ధమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి, వాటికి మరింత పదును పెట్టేందుకు తగిన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "మహిళలకు సాధికారత కల్పించడం, వారి కోసం ఇలాంటి సామర్థ్య పెంపుదల వర్క్‌షాప్‌లు నిర్వహించడం రెండూ అత్యంత ముఖ్యమైన అంశాలు" అని ఆయన నొక్కిచెప్పారు.ఈ సందర్భంగా, మహిళా శాసనసభ్యుల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఓం బిర్లా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళా నాయకులలో కొత్త స్ఫూర్తిని నింపుతాయని, ప్రజాసేవలో వారిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు కొత్త విషయాలు నేర్చుకుని, తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## వాయు కాలుష్య నియంత్రణలో గుంటూరుకు జాతీయ పురస్కారం



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 7**
వాయు కాలుష్య నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచిన గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్2026లో దేశవ్యాప్తంగా 130 నగరాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు నగరం పట్టణాల కేటగిరీలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో 'స్వచ్ఛ వాయు దివస్' సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్‌జిటి చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ చేతుల మీదుగా గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ జాతీయ పురస్కారాన్ని స్వీకరించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కేటగిరీ2లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 42వ వార్డు తొలి స్థానంలో నిలిచింది. వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యలకు ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ, గుంటూరు నగరవాసులందరికీ కమిషనర్ మయూర్ అశోక్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ప్రపంచ మార్కెట్‌లో ఏపీ ఎంఎస్‌ఎంఈలకు కొత్త అవకాశాలు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 7:**
ఆంధ్రప్రదేశ్‌లోని ఎంఎస్‌ఎంఈలు దేశీయ మార్కెట్లకే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడే స్థాయికి ఎదగాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఏపీ రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్2026ను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేయడం, విదేశీ కొనుగోలుదారులతో ప్రత్యక్ష వ్యాపార సంబంధాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ మీట్‌లో 200కు పైగా ఎంఎస్‌ఎంఈలు, 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. బుర్కినా ఫాసో, కామెరూన్, ఘనా, జపాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే తదితర దేశాల నుంచి కొనుగోలుదారులు హాజరయ్యారు. ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎంఎస్‌ఎంఈలు ఉత్పత్తుల నాణ్యత, ప్రమాణాలను మరింత పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశం ద్వారా 100 ఎగుమతి ఒప్పందాలు, సుమారు రూ.100 కోట్ల వ్యాపార అవకాశాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీ ఎంఎస్‌ఎంఈ



డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ మాట్లాడుతూ అంతర్జాతీయ కొనుగోలుదారులు ఎంఎస్‌ఎంఈల మధ్య చర్చలను ఎగుమతి ఆర్డర్లు, వ్యాపార ఒప్పందాలు, దీర్ఘకాలిక భాగస్వామ్యాలుగా మార్చడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇండియా ఎస్‌ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్ కుమార్, పరిశ్రమల శాఖ అధికారులు, అంతర్జాతీయ కొనుగోలుదారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## 2 లక్షల సీడ్‌బాల్స్‌తో ఎన్టీఆర్ జిల్లాలో పచ్చదనానికి బాట జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ.

**విజయవాడ: పెన్ పవర్,సెప్టెంబర్ 7,**
స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం వన్ ఎర్త్‌వన్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీడ్‌బాల్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పాల్గొన్నారు. పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో వన్ ఎర్త్‌వన్ లైఫ్ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, సంస్థ వాలంటీర్లు తయారు చేసిన 2 లక్షల సీడ్‌బాల్స్‌ను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ సీడ్‌బాల్స్ ద్వారా ప్రకృతి పునరుత్పత్తికి, పచ్చదనం పెంపునకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం వన్ ఎర్త్‌వన్ లైఫ్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు, మహిళలు, యువతను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్రత, రీసైక్లింగ్ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. అంతరించిపోతున్న దేశవాళీ విత్తనాలను సంరక్షిస్తూ, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంప్రదాయ విత్తన సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే మైక్రో గార్డెనింగ్, మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణ వంటి



అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణహిత జీవన విధానం వైపు నడిపించవచ్చని కలెక్టర్ అన్నారు. వన్ ఎర్త్‌వన్ లైఫ్ ఫౌండర్ ఏలూరి లీలా కుమారి మాట్లాడుతూ నగరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రతి ఇంటికీ పర్యావరణ పరిరక్షణను చేరువ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ గృహిణులకు మిద్దె తోటల పెంపకం, ఇంటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో 'ధన్వంతరి వనం' పేరుతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన్ ఎర్త్‌వన్ లైఫ్ ఆధ్వర్యంలో చేపట్టామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం, విద్యార్థి, మహిళ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని లీలా కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2 లక్షల సీడ్‌బాల్స్‌ను అనుకూలమైన కొండలు, అటవీ, బంజరు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా వెదజల్లి, సహజంగా విత్తనాలు మొలకెత్తేలా చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ ఎర్త్ వన్ లైఫ్ వాలంటీర్ టీం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## సెప్టెంబర్ 11 నుంచి 24 వరకు ఇంటింటి కుష్ఠు వ్యాధి సర్వే జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 7:**
సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సర్వేకు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధిని తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తారని తెలిపారు. శరీరంపై స్పర్శ తెలియని లేదా స్పర్శ తగ్గిన అనుమానాస్పద మచ్చలు ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనుమానిత కేసులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) ద్వారా ఉచిత చికిత్స అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా సర్వేకు పూర్తిగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బి.భాను నాయక్, డీఈఓ ఎల్.చంద్రకళ, జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశీలనకు నిలిచిన వృద్ధి గణాంకాలు


### భారత్ ఆర్థిక వృద్ధి వాస్తవమే.. కల్పితం కాదు



**విజయవాడ,పెన్ పవర్, సెప్టెంబర్, 7**
చమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య కూడా 2026 ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి సాధించడం వాస్తవిక ఫలితమేనని భారత ప్రభుత్వ గణాంకాలు, ఆర్థిక విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. వాహన విక్రయాలు, బ్యాంకు రుణాలు, ఎగుమతులు, జీఎస్‌టీ వసూళ్లు బలంగా కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు సంకేతాలని డాక్టర్ సౌరభ్ గర్గ్, డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. గత మూడేళ్లలో స్థూల జీఎస్‌టీ వసూళ్లు 32 శాతం పెరగడం, నామినల్ జీడీపీ 31.9 శాతం పెరగడం కూడా ఆర్థిక కార్యకలాపాల విస్తరణను సూచిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా రహదారులు, రేవులు, విద్యుత్ రంగంలో పెరిగిన మూలధన పెట్టుబడులు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీఎస్‌టీ, ఇన్సాల్వెన్సీ కోడ్ వంటి సంస్కరణలు ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చాయని తెలిపారు. చమురు ధరల ఒత్తిడిని ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొని, ఆ భారాన్ని పూర్తిగా ప్రజలు, పరిశ్రమలపై మోపకుండా ఆర్థిక వెసులుబాటును వినియోగించిందన్నారు. జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్ రేటింగ్‌ను 'బి బి బి +' నుంచి 'ఏ –'కు పెంచడం కూడా దేశ ఆర్థిక బలానికి గుర్తింపుగా పేర్కొన్నారు. గత సంవత్సరాల్లో కూడా గృహ పొదుపులు, రుణాల పెరుగుదల, పెట్టుబడులు, పన్ను వసూళ్లు వంటి పలు అంశాలు వృద్ధికి చోదక శక్తులుగా పనిచేశాయని వివరించారు. కేవలం కొన్ని సూచీల ఆధారంగా వృద్ధిని అంచనా వేయకుండా, అన్ని ఆర్థిక గణాంకాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని, దశాబ్ద కాలంగా నిర్మించుకున్న ఆర్థిక సామర్థ్యం, మౌలిక వసతులు, సంస్కరణల బలంతో వృద్ధిని కొనసాగిస్తోందని రచయితలు స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యలపై పోరాటానికి

### కొత్త పార్టీ అవసరం: విజయసాయిరెడ్డి



**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 7,**
ఆంధ్రప్రదేశ్‌లో గత 15 ఏళ్లుగా రాజకీయాలు టీడీపీ, వైసీపీ చుట్టూనే తిరుగుతున్నాయని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ రెండు పార్టీల మధ్య ప్రజలు నలిగిపోతున్నారని, ప్రజా సమస్యలపై సమర్థంగా పోరాడేందుకు కొత్త రాజకీయ పార్టీ అవసరమని పేర్కొన్నారు. టీడీపీ, వైసీపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. అధికార పార్టీకి పోలీసులు అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో ఆదాయం సరిగా లేకపోయినా ఖర్చులు మాత్రం భారీగా పెరుగుతున్నాయని అన్నారు. 80 శాతం మంది ప్రజలకు తలసరి ఆదాయం ఆశించిన స్థాయిలో లేదని, అదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. నిత్యావసరాల ధరలను ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2014కు ముందు రాష్ట్ర అప్పులు సుమారు రూ.1.02 లక్షల కోట్లుగా ఉన్నాయని, ప్రస్తుతం అప్పులు రూ.12 లక్షల కోట్లకు చేరుకున్నాయని చెబుతున్నారని అన్నారు. రాష్ట్రానికి ఉన్న మొత్తం అప్పులపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులను దుబారా ప్రజా సమస్యలపై పోరాటానికి కొత్త పార్టీ అవసరం.

## మహనీయుల స్ఫూర్తి.. పవన్ కళ్యాణ్‌లో ప్రతిబింబం

### జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 7,**
సుభాష్ చంద్రబోస్ దేశభక్తి స్వామి వివేకానంద ఆత్మవిశ్వాసం ఉరికొయ్యను సైతం ముద్దాడిన భగత్ సింగ్ గారి తెగువ ఈ ముగ్గురు మహనీయుల స్ఫూర్తిని నేటి తరంలో కొందరు పవన్ కళ్యాణ్ లో చూస్తున్నారు. దేశం కోసం పోరాడిన సుభాష్ చంద్రబోస్ పట్టుదల, యువతలో స్ఫూర్తిని నింపిన స్వామి వివేకానంద ఆలోచనా విధానం,ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన భగత్ సింగ్ ధైర్యం ఈ లక్షణాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా




జీవితంలో ముందుకు సాగుతున్న నాయకుడిగా పవన్ కళ్యాణ్ అభిమానులు, మద్దతుదారులు భావిస్తున్నారు. అందుకే మహనీయులు మారలేదు... వారి స్ఫూర్తి మారలేదు... కాలం మారినా దేశం కోసం నిలబడే ఆ ఆలోచన మాత్రం సజీవంగానే ఉంది" అంటున్నారు ఆయన అభిమానులు. సుభాష్ చంద్రబోస్‌లో దేశభక్తిని చూసిన తరం వివేకానందలో యువశక్తిని చూసిన తరం భగత్ సింగ్‌లో త్యాగాన్ని చూసిన తరం అదే స్ఫూర్తిని పవన్ కళ్యాణ్‌లో చూస్తోందని ఆయన అభిమానులు చెబుతున్నారు.

## ప్రజా సమస్యల అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 7:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వీకరించి, సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. పరిష్కారం సాధ్యంకాని సమస్యలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 525 అర్జీలు అందగా.. కలెక్టరేట్‌లో 284, ఎస్పీ కార్యాలయంలో 172, గుంటూరు ఆర్డీవో పరిధిలో 10, తెనాలి ఆర్డీవో పరిధిలో 22, గుంటూరు నగరపాలక సంస్థకు 35, ఇతర మున్సిపాలిటీల పరిధిలో 2 అర్జీలు నమోదయ్యాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర్, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి తదితర అధికారులు పాల్గొన్నారు.

## 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 7:**
అర్హత కలిగిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా పింఛన్లు మంజూరు చేసేలా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వృద్ధాప్య పింఛన్‌కు వయస్సు ధృవీకరణ కోసం ఆధార్, వితంతు పింఛన్‌కు భర్త ఆధార్‌తో పాటు మరణ ధృవపత్రం, ఒంటరి మహిళలకు సంబంధిత ధృవపత్రాలు, దివ్యాంగులకు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ దివ్యాంగత్వం కలిగిన సదరం ధృవపత్రం సమర్పించాలి. చేనేత, మత్స్యకారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు కూడా సంబంధిత ధృవపత్రాలను అందజేయాలని అధికారులు సూచించారు. సెప్టెంబర్ 716: దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ–కేవైసీ సెప్టెంబర్ 1721: అర్హత పరిశీలన సెప్టెంబర్ 2224: భౌతిక, శాఖాపరమైన ధృవీకరణ సెప్టెంబర్ 2526: బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు వివిధ కారణాలతో పింఛన్ పొందని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తామని తెలిపారు.

# అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలందరికీ గౌతమ్ విజ్ఞప్తి



**అవనిగడ్డ పెన్ పవర్ సెప్టెంబర్ 7**

ఇకపై పోలీసుల అక్రమ చర్యలకు నియోజకవర్గ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అనవసరమైన ఒత్తిళ్లు, లంచాల డిమాండ్లు, బెదిరింపులు, అసభ్య పదజాలం, దుర్భాషలు, అక్రమ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు, దాడులు, భయపెట్టడం లేదా చట్టవిరుద్ధమైన ఇతర చర్యలకు పాల్పడితే ప్రజలు ఇకపై భయపడాల్సిన అవసరం లేదని గౌతమ్ తెలిపారు.మీరు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా, ఏ వర్గానికి చెందిన వారైనా, ఏ సిద్ధాంతాన్ని నమ్మేవారైనా తనకు పట్టింపులు లేవని, ఒక సామాన్య పౌరులుగా మీ హక్కుల కోసం నిలబడుతున్నప్పుడు మీపై పోలీసుల ద్వారా అన్యాయం జరిగితే, మీ గొంతుకై ఎదిరించి నిలబడటానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని గౌతం స్పష్టం చేశారు..,ఖాకీ వేసుకున్నంత మాత్రాన పోలీసులకు అన్నిటిపై అతీతమైన అధికారాలు వుండవని, పోలీసులకు చట్టం ఎంత వర్తిస్తుందో సామాన్య పౌరులకూ అంతే వర్తిస్తుందని, అన్ని వేళలా తన కార్యాలయం ఫోను పనిచేస్తూనే ఉంటుందని, పోలీసు బాధితులుగా మారాల్సిన అవసరం లేదని, తన ఇంటి తలుపులు ఎప్పుడైనా ఎవ్వరైనా తట్ట వచ్చని గౌతమ్ తెలిపారు.

## అక్రమ అబార్షన్‌తో 17 ఏళ్ల మైనర్ బాలిక మృతి



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 07 :**

చిలకలూరిపేట : అక్రమ అబార్షన్ వికటించి 17 ఏళ్ల మైనర్ బాలిక ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చిలకలూరిపేట పరిధిలో చోటుచేసుకుంది. అస్సాం రాష్ట్రానికి చెందిన ఈ బాలిక స్థానిక బోయపాలెంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తోంది. సుమారు 6 నెలల గర్భంతో ఉన్న సదరు బాలిక, వైద్యుల సూచనలు లేకుండా ఓ అనధికారిక మెడికల్ షాపు నుంచి అబార్షన్ కిట్ కొనుగోలు చేసి ఇంటివద్దే మూడు రోజుల పాటు ఆ మాత్రలను వాడింది. మూడో రోజు రాత్రి తీవ్ర కడుపునొప్పి, అధిక రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అధిక రక్తస్రావం, పల్మనరీ ఎంబోలిజం కారణంగానే మరణం సంభవించిందని వైద్యులు ప్రాథమికంగా వెల్లడించారు.

ఈ ఘటనపై అధికారులు మెడికో లీగల్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా అబార్షన్ కిట్లు విక్రయించిన మెడికల్ షాపులపై, ఇందులో ప్రమేయం ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ హెచ్చరించారు. అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు విక్రయించడం, అక్రమంగా గర్భవిచ్ఛిత్తి చేయడం తీవ్రమైన నేరమని ఆయన స్పష్టం చేశారు.

## పార్టీ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న

### నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 07:**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం (ఎన్టీఆర్ భవన్) లో సోమవారం ప్రారంభమైన పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల రెండు రోజుల లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్ శిక్షణ తరగతులకు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉన్నత స్థాయి శిక్షణా కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం ఈ శిక్షణ తరగతుల ద్వారా స్పష్టమైన దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. సరికొత్త శాఖానికి నాంది పలకటం, కొత్త తరాన్ని ప్రోత్సహించటం, నియోజకవర్గాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు అవసరమైన వ్యూహాలపై ఈ తరగతుల్లో విస్తృతంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 10 సెషన్లుగా సాగుతున్న ఈ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యేల పనితీరు మెరుగుదల, సోషల్ మీడియా వినియోగం, ప్రజలతో నిరంతర సమన్వయం వంటి అంశాలపై అగ్రనాయకత్వం అందిస్తున్న సూచనలు రాబోయే రోజుల్లో ప్రజాసేవకు ఎంతగానో ఉపయోగపడతాయని అరవిందబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. నరసరావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తాము నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## 16,347 మందికి ఉద్యోగాలు రావడం వైసీపీకి ఇష్టం లేదా

### టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**

ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను వైసీపీ రాజకీయ కారణాలతోనే టార్గెట్ చేస్తోందని టీడీపీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ఆరోపించారు.తాళ్ల వెంకటేష్ యాదవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను ఐదేళ్లపాటు నిరీక్షణలో ఉంచిందన్నారు. యువగళం పాదయాత్రలో నిరుద్యోగుల సమస్యలను తెలుసుకున్న నారా లోకేష్, అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించారని తెలిపారు.నోటిఫికేషన్ నుంచి పరీక్షలు, ఫలితాలు, ధ్రువపత్రాల పరిశీలన వరకు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయడం యువతకు ఎంతో ప్రయోజనం కలిగించిందన్నారు.డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వారు ఆధారాలు చూపాలని లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కొన్ని పరిశీలనల్లో లోపాలు ఉంటే చర్యలు తీసుకోవచ్చని, మొత్తం డీఎస్సీని స్కామ్‌గా చిత్రీకరించడం సరికాదన్నారు. ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసు సేవల ప్రధాన లక్ష్యం

### - ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించి ఉత్తమ పోలీసు సేవలు అందించడమే లక్ష్యం అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 07:**

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సమస్యలు, కుటుంబ వివాదాలు, మోసాలు, బెదిరింపులు, భూ ఆక్రమణలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 82 ఫిర్యాదులు అందాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధిత పోలీసు అధికారులకు పంపించి, సత్వర పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు.మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో విచారణను వేగవంతం చేసి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఎస్పీ ఆదేశించారు.అలాగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అర్జీలు రాయడంలో పోలీసు సిబ్బంది సహకారం అందించి, వారి సమస్యలను నమోదు చేయడంలో సహాయపడ్డారు.

# ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

### - సెప్టెంబరు 7 నుంచి 16 వరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

### - జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 07:**

పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కృత్రిక శుక్లా మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. అర్హులైన వారు సెప్టెంబరు 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.కొత్త పింఛన్ దరఖాస్తు ఫారాలు సంబంధిత స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని, పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను డిజిటల్ అసిస్టెంట్ లేదా సంబంధిత కార్యదర్శులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని, అనంతరం దరఖాస్తుదారులకు రసీదు అందజేస్తారని తెలిపారు.దరఖాస్తుదారుల వివరాలను ఈ-కేవైసీ ద్వారా పరిశీలిస్తారని, వివరాలు సరిపోలిన అనంతరం అర్హత పరిశీలన, భౌతిక తనిఖీ నిర్వహిస్తారని చెప్పారు. అర్హులైన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి రాష్ట్రస్థాయికి పంపుతారని తెలిపారు.వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన దరఖాస్తులను ఆయా శాఖల ద్వారా పరిశీలించి రాష్ట్రస్థాయిలో తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.సెప్టెంబరు 7 నుంచి 16 వరకు దరఖాస్తుల స్వీకరణ, ఈ-కేవైసీ ప్రక్రియ నిర్వహించబడుతుందని, సెప్టెంబరు 17 నుంచి 21 వరకు సాధారణ అర్హత పరిశీలన, సెప్టెంబరు 22 నుంచి 24 వరకు భౌతిక తనిఖీ, సిఫారసు ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ అనుమతి, బడ్జెట్ ఆమోదం మేరకు పింఛన్ల



మంజూరు చేపడతారని పేర్కొన్నారు.దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రంతో పాటు తమ కేటగిరీకి సంబంధించిన ప్రత్యేక ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. వితంతువులు భర్త మరణ ధ్రువపత్రం, దివ్యాంగులు సదరం ధ్రువపత్రం, ఇతర వర్గాలు సంబంధిత శాఖల ధ్రువపత్రాలను జతచేయాలని తెలిపారు. అర్హులైన వారందరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి సిపిఐ వినతి







**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 07:**

పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్ వద్ద సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సంజన సింహకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, గతంలో ప్రజల తరపున సమర్పించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. అలాగే నరసరావుపేట పట్టణంలోని కట్టల చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని, హరిచంద్రపురంనకరికల్లు ఎత్తిపోతల పథకానికి తగిన నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పల్నాడు జిల్లా నలుమూలల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని, అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలని, జిల్లాలో అధ్వానంగా మారిన రహదారులను వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రజా సమస్యలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేను, కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, సిపిఐ నాయకులు సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి రంగయ్య, రొడ్డ అంజిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వైదన వెంకట్, నాగేశ్వరరావు, యు. రాజు, గిరిజన సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను నాయక్, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 7:**

జిల్లాలో గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పందిళ్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పందిళ్లను ముందస్తుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులకు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా పందిళ్లు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు.పందిళ్ల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. డీజే, సౌండ్ సిస్టమ్స్‌ను నిర్ణయించిన పరిమితుల్లోనే వినియోగించాలని, అధిక శబ్దంతో ప్రజలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక







విగ్రహాలను ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ సెల్‌లో మట్టి వినాయక విగ్రహాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నిమజ్జన ప్రాంతాలను ముందుగానే గుర్తించి క్రేన్లు, బోట్లు, డస్ట్‌బిన్లు తదితర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పందిళ్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ప్రసాదాల తయారీ, నిల్వ, పంపిణీలో ఆహార భద్రతా నిబంధనలు పాటించేలా చూడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.గణేష్ ఉత్సవ సమితి సభ్యులు అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఆస్తి నాకిప్పించి.. జీవనభృతి కల్పించండి!

**- పెద్ద కుమారుడు ఆస్తులు కాజేశాడంటూ 76 ఏళ్ల వృద్ధుడి ఫిర్యాదు**

**- పీజీఆర్ఎస్‌లో ఆర్డీవోను ఆశ్రయించిన సూరగాని చినవెంకటేశ్వర్లు**

**చీరాల, సెప్టెంబర్ 7(పెన్ పవర్):**

జీవిత చరమాంకంలో కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నకొడుకే తన ఆస్తులను లాక్కుని గాలికొదిలేశాడని ఆరోపిస్తూ 76 ఏళ్ల వృద్ధుడు అధికారులను ఆశ్రయించాడు. తన ఆస్తిని తనకు ఇప్పించడంతో పాటు జీవనభృతి కల్పించి ఆదుకోవాలని కోరుతూ సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో సూరగాని చినవెంకటేశ్వర్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల ప్రకారం.. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తాను ప్రస్తుతం చిన్న కుమారుడి వద్ద ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు. తనకు చెందిన స్థిరాస్తులను పెద్ద కుమారుడు సూరగాని నరసింహారావు, మనవళ్లు అమర్‌నాథ్,



జానకీరామ్‌లు అక్రమంగా తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. కొత్తపేట పరిధిలోని సర్వే నంబర్ 44లో ఉన్న 3.50 సెంట్ల భూమిని ఇప్పటికే విక్రయించేశారని, సర్వే నంబర్లు 325-6, 297-2, 289-1, 325-5లోని 4.68 సెంట్ల భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారని వాపోయారు.

తనను, తన భార్యను కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చినవెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య చికిత్సల కోసం ఇప్పటికే సుమారు రూ.60 లక్షల వరకు అప్పులయ్యాయని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన ప్రతిసారీ చిన్న కుమారుడు చెంచుబాబు కుమారుడు కుమార్‌రాజు తనను అన్నివిధాలా ఆదుకుంటున్నాడని పేర్కొన్నారు.తన ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఆర్డీవోకు సమర్పించిన వృద్ధుడు.. అక్రమంగా జరిగిన భూ రిజిస్ట్రేషన్లను పరిశీలించి రద్దు చేయడంతో పాటు తన భూమిని తనకు ఇప్పించి, జీవనభృతి కల్పించాలని కోరారు. ఫిర్యాదును పరిశీలించి, సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

# దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేస్తాం

## ఆర్డీవో హామీ.. సమస్యపై స్పందించిన అధికారులు




**చీరాల, సెప్టెంబర్ 7(పెన్ పవర్):**
ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, దివ్యాంగులకు నివాస స్థలాలు ఏర్పాటు చేయాలని కోరుతూ దివ్యాంగులు పోరాట సమితి ప్రతినిధులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులకు సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమితి ప్రతినిధులు వివరించారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. వారి సమస్యలను విన్న ఆర్డీవో సానుకూలంగా స్పందించి, అర్హతలను పరిశీలించి దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు పోరాట సమితి కమిటీ సభ్యులు పి. జోసెఫ్, ఎన్. దత్తాత్రేయ, ఎన్. మంత్ర నాయక్, పి. సునీత, టి. కృష్ణ, ఎం. శ్యాంప్రకాష్, ఏ. శ్రీనివాసరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

# 22 (ఎ) కేసులు త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 7 :**
22 (ఎ) కేసులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులో పరిష్కారం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, 22 (ఎ) కేసులు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి అందే ఆర్జీలు పట్ల స్పష్టమైన విచారణ చేయాలన్నారు. ఆర్జీలపై సంతృప్తికరమైన పరిష్కారం చూపించాలని, పరిష్కారం కాని వాటికి సరైన ఎండార్స్ మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్దేశిత సమయం దాటరాదని చెప్పారు. అధికారులందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఎండార్స్ మెంట్ సక్రమంగా ఇవ్వని అధికారులు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న సంగతి గుర్తించాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పక్కాగా, సంతృప్తికర రీతిలో అందుటకు ప్రతి శాఖ శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సేవలు బాగా అందించడం ద్వారా మనకు సంతృప్తి లభిస్తుందని గ్రహించాలని ఉద్బోధించారు. పురపాలక సంఘాల పరిధిలో రహదారుల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. జలధార క్రింద మంజూరైన చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యం

## ఎమ్మెల్యే, ఎంపీలపై ట్రోలింగ్ మానుకోవాలి



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 07 :**
చిలకలూరిపేట : పట్టణంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పనిచేశారని నాయకులు ఇనగంటి జగదీష్, జొన్నలగడ్డ ఫ్రాన్సిస్, శిఖా నాగరాజు తదితరులు స్పష్టం చేశారు. బాధితులను స్వయంగా పరామర్శించిన ప్రజాప్రతినిధులు, వారి చొరవతో బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందేలా చూసి అండగా నిలిచారని తెలిపారు. ఉద్యమాలు ఎప్పుడూ ప్రజా సమస్యలపై, బాధిత వర్గాలకు న్యాయం జరిగే దిశగా సాగాలి తప్ప వ్యక్తులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం సరికాదని వారు హితవు పలికారు. కొందరు ఎంఆర్‌పీఎస్ ముసుగులో తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే, ఎంపీలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ట్రోలింగ్ చేయడం బాధాకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కులానికి న్యాయం జరగాలనే సంకల్పం మంచిదే అయినప్పటికీ, ఇతరులను కించపరిచే పద్ధతులు మానుకోవాలని సూచించారు. ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు, ట్రోలింగ్‌లను ఆపి, బాధిత కుటుంబాల సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిళ్ళ దాసు, బండారు అశోక్, ధూపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

# యువత సృజనాత్మకతకు కంటెంట్ క్రియేషన్ స్టూడియో వేదిక జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ: పెన్ పవర్,సెప్టెంబరు 7,**
ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను యువత, మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆరెంజ్ ఎకానమీ'లో భాగంగా సృజనాత్మకత, డిజిటల్ మీడియా, పర్యాటకం, సంస్కృతి, ఉపాధిని అనుసంధానం చేస్తూ యువతకు కొత్త అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కంటెంట్ ల్యాబ్‌లో వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, లైవ్ స్ట్రీమింగ్ వంటి ప్రొఫెషనల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంటెంట్ తయారీ, వీడియో చిత్రీకరణ, ఎడిటింగ్, కథనం, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగంపై శిక్షణ అందిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, గ్రామీణ యువతలోని ప్రతిభను గుర్తించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలుగా మలచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, పండుగలు, స్థానిక వంటకాలు, జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసేలా నాణ్యమైన కంటెంట్ రూపొందించాలని కలెక్టర్ సూచించారు.




తద్వారా 'లోకల్ టాలెంట్ లోకల్ ఇన్‌కమ్'తో పాటు జిల్లాకు విస్తృత పర్యాటక, సాంస్కృతిక ప్రచారం లభిస్తుందన్నారు. కంటెంట్ స్టూడియో, ల్యాబ్ వినియోగం, శిక్షణకు సంబంధించిన వివరాల కోసం కంటెంట్ ల్యాబ్ నిర్వాహకులు బివి రామకృష్ణ 9885202025ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# చంద్రబాబు పాలనలో అభివృద్ధికి లోటుండదు : ప్రత్తిపాటి

**– చంద్రబాబు అంటే అబివృద్ధి.. అభివృద్ధి అంటే చంద్రబాబు**
**పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు.**
**– యడ్లపాడు మండలం దింతెనపాడులో రూ.32 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం ప్రారంభించిన ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 07 :**
ప్రజలకు ఏది అవసరమో, రాష్ట్ర భవిష్యత్ ను ఎలా నిర్మించాలో ముందే పసిగట్టగల సమర్థ నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు అని, ఆయన పాలనలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధికి ఎలాంటి లోటు ఉండదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.
సోమవారం ఆయన యడ్లపాడు మండలం దింతెనపాడులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, టీడీపీ శ్రేణులతో కలిసి ప్రజల ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని వారికి వివరించారు. అనంతరం గ్రామంలో రూ.32లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

<u>అభివృద్ధి, ప్రజాక్షేమాన్ని కోరుకునేవారు వైసీపీని సమర్థించరు.</u>

రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా క్షేమాన్ని కోరుకునే వారు ఎవరూ వైసీపీని సమర్థించరని, ఆపార్టీలో కొనసాగడం అంటే తమను తాము మోసగించుకోవడమేననే నిజాన్ని గొడ్డలిపార్టీ సానుభూతి పరులు గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. చంద్రబాబు అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే చంద్రబాబు అనే నిజం మొత్తం దేశానికే తెలుసునని, రాష్ట్రంలోని కొందరు స్వార్థపరులు మాత్రం ఆ నిజాన్ని జీర్ణించుకోవడం లేదన్నారు.. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల సమర్థ నాయకత్వం, మోదీ సహకారం వల్లే రాష్ట్రానికి తక్కువ కాలంలోనే లక్షలకోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకే గొడ్డలిపార్టీ నాయకుడు ప్రజల్లో విద్వేషాలు రేపుతున్నాడని ప్రత్తిపాటి చెప్పారు. గ్రామమైనా, రాష్ట్రమైనా నాయకులు, కార్యకర్తల ఐక్యత వల్లే బాగుపడుతుందని, ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఆయన సూచించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిప్రాయబేధాలు, అరమరికలు లేకుండా ప్రజలకోసం కలిసికట్టుగా ముందుకుసాగాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన మనప్రాంతం వాడైనందుకు మనందరం గర్వించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, మద్దినేని శివరామకృష్ణ, నాగండ్ల రాంబాబు, మాణిక్యాలరావు, అత్తొట శ్రీనివాసరావు, చౌదరి, హనుమంతరావు, బొల్లినేని శేఖర్, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**చిలకలూరిపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 07:**
చిలకలూరిపేట : ప్రకృతి పరిరక్షణతో పాటు భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ పిలుపునిచ్చారు. వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా చూడవచ్చని తెలిపారు. నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు మన సంప్రదాయాలను పరిరక్షించుకోవచ్చన్నారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. ప్రకృతి కోసం, సమాజం కోసం, భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండలనేని చరణ్ తేజ పిలుపునిచ్చారు.



# విజనరీ సీఎం బాటలో..

# ప్రతి నియోజకవర్గం ఒక 'మోడల్ స్టేట్' కావాలి

**నెల్లూరు పెన్ పవర్ సెప్టెంబర్ 7.**
స్వర్ణాంధ్ర2047 విజన్ లక్ష్యాలను రాష్ట్ర స్థాయిలో మాత్రమే కాకుండా ప్రతి నియోజకవర్గంలో కనిపించే అభివృద్ధి ఫలితాలుగా మార్చాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిఅన్నారు. గెలవడం మాత్రమే కాకుండా ఆ గెలుపును నిలబెట్టుకోవాలంటే పక్కా ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో జరిగిన టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమక్షంలో స్వర్ణాంధ్ర2047 విజన్ లక్ష్యాలను చేరుకోవడంలో ఎమ్మెల్యేలు అనుసరించాల్సిన విధానాలను ప్రశాంతి రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర2047 అనేది కేవలం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళిక కాదని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన రాష్ట్రాన్ని అందించాలనే గొప్ప సంకల్పమని అన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా వ్యవస్థలో కూడా మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఆ మార్పు ద్వారానే భవిష్యత్తు తరాలకు బంగారు భవిష్యత్తును అందించగలమని చెప్పారు.
విజనరీ లీడర్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 20 సంవత్సరాలు ముందుకు ఆలోచిస్తూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను వెల్తీ, హెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక ఆర్కిటెక్ట్‌లా ఆలోచించి అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో అనుసరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు కేవలం అసెంబ్లీలో తమ నియోజకవర్గ ప్రజల సమస్యలపై మాట్లాడటానికే పరిమితం కాకుండా, తమ నియోజకవర్గాన్ని ఇతరులకు ఒక మోడల్‌గా నిలిపేలా అభివృద్ధి చేయాలని అన్నారు.

### ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గాన్ని ఒక చిన్న రాష్ట్రంగా చూడాలి

ముఖ్యమంత్రి గారు రాష్ట్రాన్ని ఆర్కిటెక్ట్‌లా చూస్తున్న విధంగానే ప్రతి ఎమ్మెల్యే కూడా తన నియోజకవర్గాన్ని ఒక చిన్న రాష్ట్రంగా భావించి అభివృద్ధి చేయాలనే ఆలోచన కలిగి ఉండాలని ప్రశాంతి రెడ్డి అన్నారు. గ్రామాన్ని ఒక యూనిట్‌గా, మండలాన్ని ఒక యూనిట్‌గా, నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తమ నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి ఏ అవకాశం ఉందో ముందుగా గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎక్కడ వ్యవసాయం బాగుంది, ఎక్కడ హార్టికల్చర్‌కు అవకాశం ఉంది, ఎక్కడ పరిశ్రమలు రావచ్చు, ఎక్కడ ఉపాధి అవకాశాలు పెంచవచ్చు, ఎక్కడ విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సి ఉందో గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఎక్కడ వెనకబడ్డామో గుర్తించి, ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు (సీవాపు ) ఎమ్మెల్యేలకు అవసరమైన డేటా, నివేదికలు, ప్రణాళికలను అందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కీలక సహాయక వ్యవస్థగా పనిచేస్తాయని చెప్పారు. వీటి సహకారంతో ప్రతి నెలా అన్ని శాఖల పురోగతిని సమీక్షించాలని సూచించారు.

### ఎమ్మెల్యే.. కోఆర్డినేటర్, మానిటర్, ప్రాబ్లమ్ సాల్వర్

ఎమ్మెల్యే పాత్ర కేవలం సమస్యలు చెప్పి, వాటిని అధికారులు పరిష్కరించారా లేదా అని అడగడానికి మాత్రమే పరిమితం కాకూడదని ప్రశాంతి రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అధికారులకు దిశానిర్దేశం చేసే వ్యక్తిగా, అన్ని శాఖల అధికారులను ఒకే చోటకు తీసుకువచ్చే కోఆర్డినేటర్‌గా, ఫలితాలను సమీక్షించే మానిటర్‌గా, సమస్యలకు పరిష్కారం చూపే ప్రాబ్లమ్ సాల్వర్‌గా పనిచేయాలని తెలిపారు. ప్రతి ఎమ్మెల్యే 'నా నియోజకవర్గం.. నా విజన్.. నా యాక్షన్ ప్లాన్.. నా బాధ్యత' అనే ఆలోచనతో పనిచేయాలని అన్నారు. రాష్ట్ర విజన్‌ను నియోజకవర్గ స్థాయిలో అమలు చేసి ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాలని సూచించారు. ఎన్ని సమావేశాలు నిర్వహించామన్నది కాకుండా, ఈ సమావేశాల ద్వారా ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందనేదే ముఖ్యమని స్పష్టం చేశారు.

### కోవూరు ఆర్థిక వ్యవస్థను రూ.1.75 లక్షల కోట్లకు తీసుకెళ్లే లక్ష్యం

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దాదాపు రూ.300 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది స్వర్ణాంధ్ర2047 లక్ష్యమని ప్రశాంతి రెడ్డి గారు తెలిపారు. ఇదే లక్ష్యాన్ని నియోజకవర్గ స్థాయిలోనూ నిర్దేశించుకుని పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కోవూరు నియోజకవర్గం మొత్తం ఆర్థిక వ్యవస్థ రూ.8 వేల కోట్లు ఉందని, ఇందులో వ్యవసాయ రంగం భాగస్వామ్యం సుమారు రూ.3 వేల కోట్లు.. అంటే 44 శాతం ఉందని తెలిపారు. 2029 నాటికి కోవూరును సుమారు రూ.66 వేల కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. ఈ లక్ష్యాన్ని వేగంగా సాధించే దిశగా ముందుకు సాగితే, 2047 నాటికి కోవూరు ఆర్థిక వ్యవస్థను రూ.1.75 లక్షల కోట్లకు చేర్చాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని చేరుకోవడం మరింత సాధ్యమవుతుందని అన్నారు.

### వ్యవసాయాన్ని పూర్తి స్థాయి ఆర్థిక వ్యవస్థగా మార్చాలి

కోవూరు ప్రధాన ఆదాయ వనరైన వ్యవసాయ రంగాన్ని కేవలం సాగు రంగంగా కాకుండా పూర్తి స్థాయి ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గారు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్‌లు, క్రాప్ డైవెర్షన్, డ్రై ప్లాట్‌ఫామ్స్, స్టోరేజ్ గోడౌన్స్ వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తే వ్యవసాయ రంగంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను వేగంగా చేరుకోవచ్చని చెప్పారు. రైతులు పండించే పంటలను కేవలం ముడి ఉత్పత్తులుగా మార్కెట్‌కు పంపకుండా, వాటి ఆధారంగా స్థానికంగానే పంటల సేకరణ, గ్రేడింగ్, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వంటి అనుబంధ పరిశ్రమలను, వ్యవస్థలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ విధంగా వ్యవసాయ ఉత్పత్తికి సంబంధించిన ప్రతి దశలోనూ స్పష్టమైన మార్గనిర్దేశం, మౌలిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు కల్పించగలిగితే వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి కోవూరు ఆర్థిక వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.

### పీ4 అంటే దానం కాదు.. సామర్థ్యాన్ని నిర్మించడం

స్వర్ణాంధ్ర2047లో కీలక భాగాలైన పీ4, పేదరిక నిర్మూలన, బంగారు కుటుంబాలు వంటి కార్యక్రమాలపై కూడా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని తీసుకువచ్చినప్పుడు చాలామందికి దాని ఉద్దేశం వెంటనే అర్థం కాలేదని, అయితే దాని వెనుక ఉన్న ఆలోచన ఎంతో గొప్పదని అన్నారు. ప్రతిభ ఉన్న వ్యక్తికి సరైన సమయంలో అవకాశం, సహాయం, మార్గనిర్దేశం అందిస్తే వారు సమాజానికే ఆదర్శంగా ఎదగగలరని చెప్పారు. ఇదే మార్గదర్శి భావన అని తెలిపారు. పీ4 అనేది కేవలం దానం లేదా సహాయం కాదని, సామర్థ్యాన్ని నిర్మించడం దాని అసలు లక్ష్యమని స్పష్టం చేశారు. ఒక వ్యక్తికి తాత్కాలికంగా సహాయం చేయడం మాత్రమే కాకుండా, ఆ వ్యక్తి తన కాళ్లపై తాను నిలబడేలా చేయడం, తన ప్రతిభను అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించడం, భవిష్యత్తులో మరొకరికి మార్గదర్శిగా నిలిచే స్థాయికి తీసుకెళ్లేలా చేయడం పీ4 అసలు లక్ష్యమని వివరించారు. గతం మనకు ఒక పాఠమని, స్వర్ణాంధ్ర2047 మన లక్ష్యమని పేర్కొన్న ప్రశాంతి రెడ్డి రాష్ట్ర స్థాయిలో రూపొందిన స్వర్ణాంధ్ర విజన్ ప్రతి నియోజకవర్గంలో కనిపించే అభివృద్ధి ఫలితంగా మారేలా ప్రతి ఎమ్మెల్యే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి.. యువతను కాపాడుకోవాలి

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై ఏఐఎస్ఎఫ్ భారీ అవగాహన ర్యాలీ




**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబరు 07:**
యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ నాలుగు మాడ వీధుల మీదుగా కొనసాగింది. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ వద్దు.. గంజాయి వద్దు.. మహిళలపై నేరాలను అరికట్టాలి.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళల భద్రత, సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ యువత దేశానికి బలమని, వారు డ్రగ్స్, గంజాయి బారిన పడితే వారి భవిష్యత్తుతో పాటు కుటుంబాల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుందని అన్నారు. యువతను మాదకద్రవ్యాల నుంచి కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రజలు కలిసి నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను గౌరవించే సంస్కృతిని యువతలో పెంపొందించాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా గుర్తుతెలియని లింకులు, కాల్స్, మెసేజీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించడం బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు చైతు, సూర్య, ముఖేష్, భరత్, అర్జున్, సంతోష్, చరణ్, అభి, శివ తదితరులు పాల్గొన్నారు.

# కొండమిట్టలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు.. వైభవంగా ఆలయ కుంభాభిషేకం



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 07:**
22వ వార్డు ఎన్టీఆర్ నగర్ కొండమిట్టలో నూతనంగా నిర్మించిన శ్రీ వినాయక స్వామి వారి ఆలయ కుంభాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు శ్రీ వినాయక స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందడం జరిగింది. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నూతన ఆలయ నిర్మాణంతో కొండమిట్ట ప్రాంతంలో భక్తులకు మరో ఆధ్యాత్మిక కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కుంభాభిషేక మహోత్సవానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి రెడ్డి



అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల ప్రతిష్టాత్మక 'లీడర్‌షిప్ కాంక్లేవ్' కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి అగ్రగామిగా నిలిపేందుకు రూపొందించిన 'స్వర్ణాంధ్ర-2047' విజన్ లక్ష్యాలు, వాటి అమలు, నియోజకవర్గాల వ్యాప్తంగా చేపట్టాల్సిన సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ రూరల్‌లో విద్యుత్ కోతలు నివారించాలి



**ఆత్మకూర్ పెన్ పవర్ సెప్టెంబర్ 7.**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు తోడేటి అశోక్
ఆత్మకూర్ రూరల్ పరిధిలో రాత్రి వేళల్లో తరచుగా జరుగుతున్న విద్యుత్ కోతలపై తోడేటి అశోక్ ఈరోజు ఆత్మకూరు విద్యుత్ కార్యాలయంలో అధికారులను కలిసి సమస్యను వివరించి, వినతిపత్రం అందజేశారు. విద్యుత్ కోతలతో పేద ప్రజలు, విద్యార్థులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ త్వరలో సమస్యను పరిష్కరించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు హరిబాబు, జైకుమార్, సురేష్, గంగయ్య, అశోక్, సిసింద్రీ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీకాళహస్తి క్రీడాకారుడు క్రాంతికుమార్ ఎంపిక

## - అంతర జిల్లా పోటీల్లో ప్రతిభ.. జాతీయస్థాయికి దూసుకెళ్లిన క్రాంతికుమార్

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 07:**
నెల్లూరు జిల్లా అల్లూరులోని రామకృష్ణ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 12వ సీనియర్ స్త్రీ, పురుషుల అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2026లో శ్రీకాళహస్తికి చెందిన జి. క్రాంతికుమార్ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రాంతికుమార్‌ను బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ కమిటీ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసింది. దీంతో శ్రీకాళహస్తి క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమైంది.



ఈ సందర్భంగా శ్రీకాళహస్తి 1వ టౌన్ సీఐ, రూరల్ సీఐలు క్రాంతికుమార్‌ను సత్కరించి అభినందించారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సీఐలు సూచించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

# అంకాలమ్మ ఆలయ కుంభాభిషేకంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

## - ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందజేత



**శ్రీకాళహస్తి,పెన్ పవర్, సెప్టెంబర్ 07:**
మండలంలోని చెర్లోపల్లి గ్రామ హరిజనవాడలో నూతనంగా వెలసిన శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ పరమేశ్వరి అమ్మవారి విగ్రహ



ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు.
ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.50,000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మావుళ్ళపల్లి వెంకటేశ్వర్లు నాయుడు, దాసరి హరి, రాధాకృష్ణారెడ్డి, సీఎం రాజా, కళ్యాణ్, పులి లడ్డు, ముప్పాల మురళి, పులి మణి, సుకుమార్, భాస్కర్, నారాయణ, రాజేష్, మహదేవ్, సోహెల్, ప్రహ్లాద్, వినయ్ తదితర వైఎస్సార్సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



# విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయానికి పాల క్యాన్ల విరాళం

## ప్రతి మంగళవారం అభిషేకానికి వచ్చే పాలకు సౌకర్యం ముగ్గురు దాతల సేవాభావం

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 07:**
విజ్ఞానగిరి కొండపై వెలసి ఉన్న శ్రీ కుమారస్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహించే స్వామివారి అభిషేకానికి భక్తులు పెద్ద ఎత్తున పాలను దాతల రూపంలో అందిస్తున్నారు. దేవస్థానం తరఫున ఇప్పటికే మూడు పెద్ద గిన్నెలు నిండా పాలు వస్తుండగా, పలువురు భక్తులు తాము తీసుకొచ్చిన పాల క్యాన్లను సైతం ఆలయం బయట ఉంచుతున్న పరిస్థితి నెలకొంది.
ఈ విషయాన్ని గమనించిన దేవస్థానం ధర్మకర్తల సభ్యుడు కొండ



సతీష్ బజార్‌లోని తనకు పరిచయమున్న మిత్రులను సంప్రదించి, పాల నిల్వకు ఉపయోగపడే క్యాన్లను సమకూర్చాలని కోరారు. స్పందించిన ముగ్గురు దాతలు కుందాం దేవా, కుందాం కిరణ్, సినిమా వీధిలోని బాలాజీ జనరల్ స్టోర్స్ వారు ఒక్కొక్కటి చొప్పున 10 లీటర్ల పాల క్యాన్‌ను విరాళంగా అందించారు. దాతలు అందించిన మూడు పాల క్యాన్లను కుమారస్వామి దేవస్థానం ధర్మకర్తల చైర్మన్ బుజ్జి మరియు ధర్మకర్తల సభ్యుడు కొండ సతీష్ చేతుల మీదుగా ఆలయ పూజారికి అందజేశారు. ఇకపై ప్రతి మంగళవారం స్వామివారి అభిషేకానికి భక్తులు సమర్పించే పాలను ఈ క్యాన్లలో సేకరించి వినియోగించనున్నారు. అభిషేకానికి పాల సేకరణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యం కల్పించేందుకు దాతలు ముందుకు రావడం పట్ల ఆలయ ధర్మకర్తలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

## వంశపారంపర్య ఆస్తికి రక్షణ కల్పించాలి: బాధితుల విజ్ఞప్తి

**తొట్టంబేడు,పెన్ పవర్,సెప్టెంబర్ 7:**
హైకోర్టు ఉత్తర్వుల మేరకు వంశపారంపర్యంగా సంక్రమించిన తమ ఆస్తికి రక్షణ కల్పించాలని కోరుతూ తొట్టంబేడు గ్రామానికి చెందిన బాధితులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తొట్టంబేడు గ్రామానికి చెందిన గంగయ్య భార్య కృష్ణవేణమ్మకు సంబంధించిన పలు సర్వే నంబర్లలోని భూములపై హైకోర్టులో జరిగిన విచారణలో ఆమెకు అనుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయని బాధితులు తెలిపారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు తమ పొలాల్లోకి ప్రవేశించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని సీఐ దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి జోక్యం చేసుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలని వారు కోరారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, తమ ఆస్తికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంబంధిత సర్వే నంబర్లకు సంబంధించిన హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను సీఐకి అందజేశారు. కోర్టు ఆదేశాలను పరిశీలించి, వాటి మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూ వివాదం మరింత ముదరకుండా అధికారులు జోక్యం చేసుకుని, కోర్టు ఉత్తర్వులను



పకడ్బందీగా అమలు చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు సమగ్ర సర్వే, నివారణ చర్యలు చేపట్టాలి

## " జె సి గోవిందరావు"




**తిరుపతి: పెన్ పవర్, సెప్టెంబర్ 7**
జిల్లాలో సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్టు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము" అనే లక్ష్యంతో రెండు వారాల పాటు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సర్వేకు పూర్తి సహకరించి, శరీరంపై స్పర్శ తెలియని అనుమానాస్పద మచ్చలు ఉంటే సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సర్వేలో ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ సభ్యులను పరీక్షిస్తారని తెలిపారు. అనుమానిత కేసులను గుర్తించి పీహెచ్‌సీ వైద్య బృందం ద్వారా మరోసారి పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) అందిస్తారని చెప్పారు. కుష్టు వ్యాధికి పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితం అని, తొలిదశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ శైలజ, డీఎన్ఎంఓ డాక్టర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక పాలనకు నారా లోకేష్ నిదర్శనం

- 148 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేసి రికార్డు
- టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం.ఉమేష్ రావు

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 07:**
రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తున్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు. 'ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని 21వ వార్డు, 50వ బూత్ పరిధిలోని జయరాం రావు వీధిలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్డీయే కూటమి రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బూత్ కన్వీనర్లు తుపాకుల ప్రసాద్, గాజుల భగత్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

**148 రోజుల్లోనే మెగా డీఎస్సీ పూర్తి**
యువగళం పాదయాత్ర సందర్భంగా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన అనంతరం మెగా డీఎస్సీ నిర్వహించి, కేవలం 148 రోజుల్లో నోటిఫికేషన్, పరీక్షలు, ఫలితాలు, నియామక ప్రక్రియను పూర్తి చేయడం నారా లోకేష్ సమర్థ పాలనకు నిదర్శనమని ఉమేష్ రావు అన్నారు. మొత్తం 16,347 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో ఆనందం నింపారని పేర్కొన్నారు.

**సాంకేతికతతో పకడ్బందీగా డీఎస్సీ**
టి సి ఎస్ అయాన్ సంస్థ సాంకేతిక సహకారంతో డీఎస్సీ పరీక్షలను అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యల మధ్య నిర్వహించి, ప్రశ్నాపత్రం లీకేజీలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించి రికార్డు సమయంలో నియామకాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు.

**అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ లక్ష్యం: ఉమేష్ రావు**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని ఉమేష్ రావు విమర్శించారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రతిపక్షం అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

**ప్రజాభీష్టమే ఎన్డీయే కూటమి అజెండా**



సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ఎన్డీయే ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని, మరింత మందికి కొత్త పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, మాజీ కౌన్సిలర్ రాజారాం వి.పవార్, కోట చంద్రశేఖర్, డి.వి.నారాయణ, శేఖర్, గాజుల భగత్, తుపాకుల ప్రసాద్, సులేమాన్, శంకరయ్య, ప్రభాకర్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పాదయాత్రల కౌంటర్...

**విజయవాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు. 2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం.గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది.ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు.జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

# రాజకీయాలకు అయ్యన్న గుడ్ బై...



**విజయవాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు మొత్తానికి రాజకీయాలలో ఒక సంచలనమైన నాందికి శ్రీకారం చుట్టారు. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టే విధంగా చెప్పే అయ్యన్న.. చివరికి తన రాజకీయ భవితవ్యంపై కూడా కీలకమైన నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏ నాయకుడైనా సరే రాజకీయాలకు వచ్చిన తర్వాత.. రిటైర్మెంట్ అనేది తీసుకోకుండా ఉంటారు. చివరికి కాటికి కాలు చాపే వయసు వచ్చినప్పటికీ కూడా అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అప్పట్లో బీహార్ రాష్ట్రంలో లాలు ప్రసాద్ యాదవ్ ఆస్పత్రిలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి పదవిని వదులుకోలేదు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పటికీ కూడా.. తన భార్యను ముఖ్యమంత్రిని చేసి.. రాజకీయాలలో ఫ్యామిలీ ప్యాకేజీ వ్యవహారం ఎలా ఉంటుందో ఆయన నిరూపించారు.కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే కాదు మన తెలుగు నాటకూడా ఈ తరహా రాజకీయ నాయకులకు కొదవలేదు. అయితే అటువంటి సాంప్రదాయం కొనసాగుతున్న నేపథ్యంలో ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2029లో ఏపీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటికి అయ్యన్నపాత్రుడికి 73 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు.. అప్పటికి ఒకవేళ తాను రాజకీయాలలో కనుక ఉండి ఉంటే.. తినడం కష్టమవుతుందని పేర్కొన్నారు.అయ్యన్న తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా టిడిపిలో చాలామంది సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే యువకులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని టిడిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తనకు 73 సంవత్సరాల వయసు వస్తుంది కాబట్టి అప్పటికి తాను రాజకీయాల్లోకి ఉండడం కరెక్ట్ కాదని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎంతోమంది అయ్యన్నపాత్రుడు కంటే సీనియర్ నాయకులు ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కి 80 సంవత్సరాలు ఉంటాయి. ఈయన కూడా అయ్యన్నపాత్రుడితో పాటే 1983 నుంచి టిడిపిలో ఉన్నారు. మరో సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు కూడా రాజ్యసభ పదవిని కోరుకుంటున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. కిమిడి కళా వెంకట్రావు.. బండారు సత్యనారాయణమూర్తి వంటి వారు కూడా టిడిపిలో సీనియర్ నేతలుగా పేరు తెచ్చుకున్నారు. అయ్యన్న తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో 2029 ఎన్నికల్లో చంద్రబాబు వీరికి టికెట్ ఇస్తారా.. లేదా అనేది చూడాల్సి ఉంది.

# కులాల చుట్టే పోలరైజేషన్...

**కాకినాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే కుల సమీకరణాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ ప్రభావం మరో రూపంలో కనిపిస్తోంది. ముఖ్యంగా యువతలో రాజకీయ ఆసక్తి పెరగడం ఒకవైపు సానుకూల పరిణామంగా కనిపిస్తున్నప్పటికీ, సామాజిక వర్గాల ఆధారంగా వారు విడిపోతున్న తీరు మాత్రం చర్చకు దారితీస్తోంది.గతంలో కులం, రాజకీయాల విషయంలో పెద్దల మధ్య ఎక్కువగా చర్చలు జరిగేవి. యువత మాత్రం వాటికి కొంత దూరంగా ఉండేది. తమ చదువు, ఉద్యోగం, వ్యక్తిగత భవిష్యత్తుపైనే ఎక్కువగా దృష్టి పెట్టేది. కానీ సామాజిక మాధ్యమాలు విస్తరించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. రాజకీయ నాయకుల ప్రసంగాలు, అభిమాన సంఘాల కార్యక్రమాలు, సోషల్ మీడియా పోస్టులు నేరుగా యువతను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో తమకు నచ్చిన పార్టీ లేదా నాయకుడి పట్ల కొందరు యువకులు తీవ్ర అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు.రాజకీయ చైతన్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిదే. యువత విధానాలను ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరుపై చర్చించడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం ఆరోగ్యకరమైన పరిణామాలే. కానీ రాజకీయ అభిమానం సామాజిక వర్గ గుర్తింపుతో కలిసిపోయినప్పుడు పరిస్థితి మరో విధంగా మారే అవకాశం ఉంటుంది. ఒక నాయకుడిని ఆయన విధానాల కోసం కాకుండా తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే చూడటం రాజకీయ చర్చను సంకుచితం చేస్తుంది.ఇటీవల ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడం ఈ చర్చకు మరింత బలం ఇచ్చింది. బైక్ ర్యాలీలు, భారీ సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. చదువుకునే ప్రదేశాలు, పనిచేసే చోట్ల కూడా ఒకే సామాజిక నేపథ్యానికి చెందిన వారు సమూహంగా ఏర్పడి వేడుకలు నిర్వహించిన సందర్భాలు కనిపించాయి. సహజమైన అభిమానాన్ని మించి భావోద్వేగం కనిపించడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది.ఒక నాయకుడిపై అభిమానం ఉండటం తప్పు కాదు. అదే అభిమానం ఇతర పార్టీలను లేదా సామాజిక వర్గాలను తక్కువగా చూడటానికి దారితీయకూడదు. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం

చేసిన వారిపై దూషణలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం వంటి ధోరణులు యువతలో పెరగడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. వాటిని గౌరవించడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే.ఇక యువత ఒక నిర్దిష్ట సామాజిక వర్గం చుట్టూ రాజకీయంగా సమీకృతమైతే భవిష్యత్ ఎన్నికల్లో దాని ప్రభావం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. రాజకీయ పార్టీలు కూడా యువత మద్దతును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే యువతను కులం, ప్రాంతం లేదా వ్యక్తిగత అభిమానాలకు పరిమితం చేయకుండా విధానాలు, అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఆలోచించేలా చేయడం అవసరం. అప్పుడే యువ రాజకీయ చైతన్యం సమాజానికి బలంగా మారుతుంది.

# పవన్ వరుస గైర్హాజర్లు... కారణం ఏమిటీ

**ఒంగోలు, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరచూ కేబినెట్ సమావేశాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం జరిగిన మంత్రివర్గ భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళ లో ప్రకృతి ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ గైర్హాజరుకు ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని తెలుస్తోంది. అయితే గతంలో కూడా కొన్ని సమావేశాలకు ఆయన రాకపోవడం, మరికొన్ని సందర్భాల్లో సమావేశానికి హాజరై అనారోగ్య కారణాలతో మధ్యలోనే వెళ్లిపోవడం జరిగింది.టీడీపీ –జనసేన –బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 వరకు కేబినెట్ సమావేశాలు జరిగాయని, వాటిలో పవన్ కొన్ని సమావేశాలకు గైర్హాజరయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 3 వరకు దాదాపు 15 మంత్రివర్గ సమావేశాలు జరిగితే, వాటిలో చాలా తక్కువ సమావేశాలకే ఆయన హాజర య్యారని ప్రచారం జరుగుతోంది. సుమారు 11 భేటీలకు ఆయన దూరంగా ఉన్నారని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.పవన్ కళ్యాణ్‌కు ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండటం కూడా ఈ పరిణా మాలకు కారణంగా కనిపిస్తోంది. కొంతకాలం క్రితం ముంబై లోని ఆసుపత్రిలో ఆయన భుజానికి శస్త్రచికిత్స చేయించుకు న్నారు. ఆ తర్వాత కూడా నొప్పి పూర్తిగా తగ్గకపోవడంతో విశ్రాంతి, చికిత్స కోసం కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సహజంగానే చూడాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి. అయితే రాజకీయంగా మాత్రం ఈ అంశంపై భిన్నమైన చర్చలు మొదలయ్యాయి. పవన్ గైర్హాజరు పూర్తిగా ఆరోగ్య కారణాల వల్లేనా? లేక ఇందులో రాజకీయ కోణం కూడా ఉందా? అనే సందేహాలను కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులకు కూడా పవన్ గతంలో క్రమం తప్పకుండా హాజరయ్యేవారని, ఇటీవల మాత్రం ఆయన పాల్గొనడం తగ్గిందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.ఒక కేబినెట్‌లో కీలకమైన శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలకు దూరంగా ఉండటం సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కేవలం మంత్రి మాత్రమే కాకుండా ఒక రాజకీయ పార్టీకి అధినేత కావడంతో ఆయన గైర్హాజరుపై సహజంగానే ఎక్కువ దృష్టి పడుతోంది.

# వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

**తిరుపతి, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమీదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

# స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

**శ్రీకాకుళం సెప్టెంబర్ 7, పెన్ పవర్:** స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్ట్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ వంటి సదుపాయాల కల్పన ఉన్నాయి.

# వడివడిగా లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లు




**విజయవాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఏపీ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు.. ఓటర్ల జాబితా.. ఇతర వ్యవహారాలను ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలవేళ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు ఆయన కీలక ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో చాలామందికి పదవులు రాబోతున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా జిల్లాలు ఏర్పాటు చేశారు. అంతటితోనే ఆగిపోయారు. శాశ్వతమైన నిర్మాణాలు.. బలమైన కార్య నిర్వాహక వ్యవస్థ.. కొత్త పదవుల భర్తీ వంటివి చేయలేకపోయారు .జగన్ చేయలేక పోయిన పనిని ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో ప్రస్తుతం 13 జెడ్పీలు మాత్రమే ఉన్నాయి. వీటిని 28 చేయాలని ఇటీవల చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు నిర్ణయం మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ పరిపాలన కాలంలో మార్కాపురం.. పోలవరం జిల్లాలకు కూడా కూటమి ప్రభుత్వం జడ్పీలను ఏర్పాటు చేసింది. అంతేకాదు కొత్త జిల్లా పరిషత్తుల నిర్వహణ కోసం ఏకంగా 30 కీలకమైన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తోడు అదనంగా 15 జడ్పీ సీఈవో.. 15 డిప్యూటీ సీఈవో పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సెప్టెంబర్ 24 తో ప్రస్తుతం కొనసాగుతున్న జెడ్పి పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఇది పూర్తి అయిన వెంటనే 28 కొత్త జడ్పీ ల వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. అంతేకాదు ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు 660 మండలాలను కొత్త జిల్లా పరిషత్ పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.జెడ్పిల పనితీరు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ముందు చూపుతో ఉన్నారు. వివాదాస్పద.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కాకుండా కొత్త జడ్పీ లకు ప్రస్తుతం ఉన్న పారదర్శకమైన సిబ్బందిని ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. పురపాలక ఎన్నికలు పూర్తి కాకముందే జిల్లా పరిషత్ లకు సంబంధించిన పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కొత్త జిల్లాలవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ముఖ్యమంత్రి నిర్ణయంతో పరిష్కారం కాబోతున్నాయి. ఆశావాహులకులకు కొత్తగా పదవులు కూడా దక్కబోతున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం కూడా మారనుంది.

## పాక్ కెప్టెన్‌కు ఐసీసీ ఫైన్.. షఫాలీని ఔట్ చేసి సైగలు చేయడంతో చర్యలు

- షఫాలీ వర్మను ఔట్ చేశాక అతిగా సంబరాలు చేసుకున్న పాక్ కెప్టెన్
- ఫాతిమా సనా ప్రవర్తనపై చర్యలు తీసుకున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి
- మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ కేటాయింపు
- 24 నెలల వ్యవధిలో ఫాతిమాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్
- ఈ మ్యాచ్‌లో పాక్‌ను చిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు




**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా ఐసీసీ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించింది. టీమిండియా బ్యాటర్ షఫాలీ వర్మ వికెట్ తీసిన అనంతరం అనుచితంగా ప్రవర్తించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు, ఆమె ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్ షఫాలీ వర్మ (12) ఫాతిమా సనా బౌలింగ్‌లోనే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. వికెట్ తీసిన ఉత్సాహంలో ఫాతిమా, షఫాలీని ఉద్దేశించి పెవిలియన్ వైపు వేళ్లాలంటూ వేలితో సైగ చేస్తూ అనుచితంగా ప్రవర్తించింది. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధనలను ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత 24 నెలల కాలంలో ఫాతిమా సనాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అంపైర్ ఔట్ ఇచ్చినప్పటికీ క్రీజు వదిలి వెళ్లేందుకు నిరాకరించినందుకు ఆమె ఖాతాలో తొలి డీమెరిట్ పాయింట్ చేరింది.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర.. డబుల్ సెంచరీతో అరుదైన జాబితాలోకి!

- ఫైనల్లో 200 చేసిన ఐదో బ్యాటర్
- ఫస్ట్‌క్లాస్‌లో 4,000 పరుగులు పూర్తి
- ఇదే ఫార్మాట్‌లో ఇషాన్‌కు 10వ సెంచరీ
- కుశాగ్ర కూడా ఫైనల్లో సెంచరీ
- ప్రస్తుతం ఆధిపత్యంలో ఈస్ట్ జోన్



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరపున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

## స్పిన్ వ్యూహమే మా బలం.. స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకొని బౌలింగ్ చేశా: శ్రీ చరణి




**హైదరాబాద్ పెన్ పవర్:** వుమెన్స్ టీ20 ఆసియా కప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో (3 వికెట్లు, 7 పరుగులు) చెలరేగిన యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ జట్టు వ్యూహాలను పంచుకున్నారు. మ్యాచ్‌కు ముందే తమ స్పిన్ బౌలర్లు అందరూ (ప్రేమ, తాను, దీప్తి, రాధా యాదవ్ ) కలిసి కూర్చుని వ్యూహరచన చేస్తామని చరణి తెలిపారు. సీనియర్లు చెప్పిన విషయాలను మైదానంలో సమర్థవంతంగా అమలు చేయడంపైనే తాము దృష్టి పెడతామని ఆమె స్పష్టం చేశారు. పిచ్‌ను పరిశీలించిన తర్వాత బంతికి మంచి టర్న్ లభిస్తుందని గ్రహించి, కేవలం స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టానని చెప్పారు. విషయాలను ఎక్కువగా ఆలోచించకుండా సింపుల్‌గా ఉంచుకోవడం, బేసిక్స్‌పైనే ఫోకస్ పెట్టడమే తన సక్సెస్‌కు సీక్రెట్ అని చరణి పేర్కొన్నారు. ఇక అద్భుతంగా రాణించిన తోటి బౌలర్ ప్రేమ రావత్‌ను ప్రశంసిస్తూ.. ఆమె ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ చేయగల సహజ ప్రతిభావంతురాలైన క్రికెటర్ అని కొనియాడారు. బౌలర్లకు సహకరించే ఈ వికెట్‌పై సుమారు 120 పరుగులు సరైన స్కోరేనని అభిప్రాయపడిన ఆమె, ఇకపై టోర్నమెంట్‌లో తాము ఒక్కో మ్యాచ్‌పైనే పూర్తి దృష్టి పెడతామని తేల్చిచెప్పారు.

# తారక్ స్టైల్ ను అసలు మ్యాచ్ చేయగలరా?







యంగ్ టైగర్ ఎన్టీఆర్ అంటే మాస్.. యాక్షన్.. డైలాగ్స్ మాత్రమే కాదు. డ్యాన్స్ కూడా ఆయనలోని అతిపెద్ద ప్లస్ పాయింట్లలో ఒకటి. స్క్రీన్ పై సాంగ్ మొదలైన క్షణం నుంచి ప్రేక్షకుల చూపు తనవైపు తిప్పుకునే స్టైల్ తారక్ సొంతం. అందుకే ఇప్పుడు డ్రాగన్ లో ఆయనతో కలిసి ముగ్గురు హీరోయిన్లు స్టెప్పులేయనున్నారనే రూమర్హాట్ టాపిక్ గా మారింది. అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే.. తారక్ డ్యాన్స్ స్టైల్ ను వాళ్లు మ్యాచ్ చేయగలరా? అని. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్ పై భారీ అంచనాలున్నాయి. హైవోల్టేజ్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న సినిమాలో భారీ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా భారీ సెట్ కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పాటలో రుక్మిణీ వసంత్‌తో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు తారక్ తో కలిసి కనిపించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే ఆ పాటలో అసలు సవాల్ హీరోయిన్లకు కాదు.. కొరియోగ్రఫీకే. ఎందుకంటే తారక్ డ్యాన్స్ ను నార్మల్ కమర్షియల్ హీరో స్టైల్‌తో పోల్చలేం. ఆయనకు చిన్నప్పటి నుంచే కూచిపూడి శిక్షణ ఉంది. ఆ క్లాసికల్ ప్రాక్టీస్ వల్లే ఆయన స్టెప్స్ లో స్పీడ్ తోపాడు కంట్రోల్, రిథమ్, పోస్చర్ కనిపిస్తాయి. తారక్ డ్యాన్స్ లో మొదట కనిపించేది ఎనర్జీ. కానీ అది కేవలం గట్టిగా కదలడం కాదు. వేగంగా స్టెప్పులు వేసినప్పటికీ బాడీ కంట్రోల్ కోల్పోరు. రెండోది ఫుట్ వర్క్. బీట్ అందుకోవడం మాత్రమే కాకుండా.. తన మూవ్మెంట్స్ తో మరింత హైలైట్ చేయడం ఆయన స్టైల్ లో కనిపిస్తుంది. మూడోది ఎక్స్ప్రెషన్. తారక్ కు డ్యాన్స్ అంటే కేవలం స్టెప్పుల వరుస కాదు. పాటలోని ఫీలింగ్ ను ముఖంలోకి తీసుకురావడం ఆయన స్పెషాలిటీ. అందుకే ఒకే పాటలో ఎనర్జీ, అల్లరి, రౌద్రం, స్టైల్.. ఇలా భిన్నమైన షేడ్స్ ను చూపించగలుగుతారు.

దీనికి బెస్ట్ ఎగ్జాంపుల్ ఆర్ఆర్ఆర్ లోని నాటు నాటు సాంగ్. ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి చేసిన ఆ పాటలో కష్టమైన కొరియోగ్రఫీ ఉన్నప్పటికీ ఇద్దరి స్టైల్ ను మ్యాచ్ చేయడానికి ప్రత్యేకంగా ఎన్నో వేరియేషన్స్‌పై పని చేసినట్లు దర్శకుడు రాజమౌళి, కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ వివరించారు. ఇక్కడే డ్రాగన్ స్పెషల్ సాంగ్‌పై ఆసక్తి పెరుగుతోంది. ముగ్గురు హీరోయిన్లు ఉన్నారన్నది ఒక ఎత్తయితే.. వారందరినీ తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా చూపించడం మరో ఎత్తు. పాటలో తారక్ ది ఒక ప్రత్యేకమైన డ్యాన్స్ లాంగ్వేజ్. దానికి తగ్గట్టుగా కొరియోగ్రఫీ ఉంటేనే సాంగ్ మరింత ఎలివేట్ అవుతుంది. ఇక సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన మాస్ బీట్ కు తారక్ డ్యాన్స్ తోడైతే.. పాటలో బీట్ కంటే ముందే తారక్ ఫుట్ వర్క్ ప్రేక్షకులను థియేటర్లలో ఊపేయొచ్చు. అందుకే డ్రాగన్ స్పెషల్ సాంగ్ లో అసలు పోటీ ముగ్గురు హీరోయిన్ల మధ్య కాదు. వాళ్లకు, తారక్ డ్యాన్స్ ఎనర్జీకి మధ్యే. తారక్‌తో కలిసి స్టెప్పులేయడం ఒక విషయం.. ఆయన రేంజ్ లో అదే ఎనర్జీని స్క్రీన్ పై నిలబెట్టడం మరో విషయం. మరేం జరుగుతుందో..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com